క్లుప్తంగా

పరీక్ష కిట్లు అందజేత

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం గ్రామం నుంచి 10వ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పరీక్ష కిట్లు అందజేశారు. సంస్థ ప్రతినిధి మధు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

రక్తదానం.. ప్రాణదానం



హరికృష్ణను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: భగీరథపురం గ్రామంలో మహి మహదేవ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ సంస్థ రక్తం యూనిట్లు సేకరించింది. 49 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించిన సంస్థ ప్రతినిధి తంగి హరికృష్ణకు రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు సన్మానించారు. రక్తదానం చేసిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రెడ్ క్రాస్ ప్రతినిధి పింకి చైతన్య పాల్గొన్నారు.

చదవడం మాకిష్టం



చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వేమన, సుమతి, భాస్కర శతకాలు, తెలుగు పద్యాలు, కథలు పుస్తకాలు చదివించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి మలిపెద్ద చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

ముగిసిన యోగా తరగతులు



యోగా తరగతుల్లో సాధకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురూజీ రవిశంకర్ రూపొందించిన హ్యాపీనెస్– సుదర్శక్రియ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా టీచర్ కొఠారి రేణుక యోగాసనాలతో పాటు ప్రాణాయామం, సుదర్శన్ క్రియను నేర్పారు. వలంటీర్లు నటుకుల రేణుక, ఉమా శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

లాఫింగ్ క్లబ్‌లో నీతిపోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు జంతువులతో నీతి కథలు, గేమ్స్ పోటీలు జరిగాయి. 24 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానిల్లో నిలిచిన పూజశ్రీ, మనస్విని, రేవంత్‌లకు బహుమతులు అందించారు. అతిథులు నటుకుల మోహన్ సంస్థకు మెగాఫోన్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ఎల్.నందికేశ్వరరావు బి.ఎం.ఎస్.పట్నాయక్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ప్రవచనం



నారాయణమూర్తిని సత్కరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సనత్సు జాతు గ్రంథాన్ని విదురుని ప్రార్థనపై ధృతరాష్ట్రునికి బ్రహ్మ విద్యా విషయాలు బోధించాడని వక్త సనపల నారాయణమూర్తి అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో 'సనత్సు జాతీయము'అనే అంశంపై ఆయన ఆదివారం ప్రసంగించారు. ధృతరాష్ట్రుని సందేహాలకు సమాధానాలు చెప్పారని, మృత్యువంటే బ్రహ్మవిద్య తెలియక పోవడమే అని వక్త అన్నారు. మందిరం తరపున పలువురు సభ్యులు వక్త నారాయణమూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో మందిరం సభ్యులు డాక్టర్ నిక్కు అప్పన్న, నిష్టల నర్సింహమూర్తి, పి.హరనాథరావు, బలగ తౌడు, బాబూరావు, పి.ఈశ్వరరావు,"సరస్వతి, అనురాధ, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలకు చెక్


- నిరంతర విద్యుత్ కోసం చల్లపేటలో అదనంగా 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు



చల్లపేట సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 5 ఎంవీ ట్రాన్స్‌ఫార్మర్

గార: వేసవి వచ్చిందంటే ఉక్కపోత, వేడి గాలులు. దీనికి ఏమైనా విద్యుత్ అంతరాయం ఏర్పడిందా ఇక సామాన్యుల కష్టాలు వర్ణణాతీతం. జిల్లాలో మొట్టమొదటిగా ఈపీడీసీఎల్ పరిధిలో గార మండలాన్ని 24 గంటలు నిరంతర విద్యుత్ ఇవ్వాలని పైలట్ ప్రాజెక్టుగా నిర్ణయించారు. ఈ ప్రాజెక్టుకు ఎంపికచేసే విధంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు కృషి చేశారు. అప్పట్లో అదనంగా కళింగపట్నం, చల్లపేట సబ్‌స్టేషన్లు ఏర్పడ్డాయి. దీంతో కొంత సమస్య తగ్గినా, వ్యవసాయ పంపుసెట్లు, విద్యుత్ వాడకం పెరగడం, మిల్లులు ఎక్కువగా అవ్వడంతో మరలా అంతరాయాలు ఏర్పడుతున్నాయి. చల్లపేట సబ్‌స్టేషన్ పరిధిలో అంపోలు, శ్రీకూర్మం, గొంటి, బలరాంపురం, రామచంద్రాపురం, వాడాడతో పాటు గ్రామీణ మండలం వప్పంగి పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో వ్యవసాయ పంపుసెట్లు 424, గృహ అవసరాల కనెక్షన్లు 12,486, రైస్ మిల్లులు 65, వ్యాపారసంస్థలు 2123 విద్యుత్ కనెక్షన్లున్నాయి. సాధరణంగా వీటికయ్యే విద్యుత్ 250 ఏంప్స్ దాటిపోవడంతో గతేదాది ఐదు ఎంవీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. జనవరి నెలాఖరు వరకు అంతరాయాలు కూడా ఏర్పడేవి. రెండవ ట్రాన్సుఫార్మర్ 5 ఎంవీ కెపాసిటీ ఏర్పాటు కోసం ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి, ఈఈ బయ్యన్ననాయుడు కృషితో రూ. 50 లక్షల ఖర్చు చేసి కొత్తది ఏర్పాటు చేశారు. పాత ట్రాన్స్‌ఫార్మర్‌పై వ్యవసాయ పంపుసెట్లు, వప్పంగి గ్రామం, మిగిలిన భారమంతా పాత ట్రాన్స్‌ఫార్మర్‌పై వేయడంతో ఇబ్బందులు తలెత్తడం లేదు. దీంతో వ్యవసాయానికి నిరంతరం తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా ఇస్తున్నారు. నేరుగా సబ్‌స్టేషన్ లేదా వేర్వేరు లైనులో బ్రేక్‌డౌన్ ఏర్పడితే తప్పా విద్యుత్ నిలిచే అవకాశం లేదని జేఈ పవన్‌కుమార్ స్పష్టం చేశారు. దీంతో విద్యుత్ వినియోగదారులు, రైస్ మిల్లు యజమానులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరా బాగుంది



15 రోజులుగా వ్యవసాయ పంపుసెట్ కోసం విద్యుత్ ఆగకుండా ఇస్తున్నారు. గతంలో ఒకసారి మోటారు వేశాక బట్టి తడిచిలోపే మరలా కరెంటు పోవడంతో చాలా ఇబ్బందులుండేవి. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కరెంటు బాగా ఉండటంతో వేసవి అయినా ఇబ్బంది లేదు.

–రుప్ప భూలోకడు, రైతు,. దీపావళి

నాణ్యమైన విద్యుత్ వస్తుంది



గత కొద్ది రోజులుగా తీర ప్రాంతాల్లో కూడా నాణ్యమైన విద్యుత్ వస్తుంది. దీనివలన చాలా వరకు ఇబ్బందులు తగ్గాయి. రొయ్య సాగుచేసే రైతులతో పాటు వ్యవసాయ సాగు చేసే రైతులు, మిల్లు యజమానులు, సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు తొలగాయి. విద్యుత్ సరఫరా తీరు బాగుంది.

–గురుసు పోలారెడ్డి, సుంకరిపాలెం

సజావుగా గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష



ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ ఏయూలో పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రాధిక



శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద డీఎస్పీ శృతికి సూచనలు చేస్తున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం సైన్స్, ఆర్ట్స్, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆదివారం రెండు పూటలా గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. ఈ కేంద్రాలకు 1,248 మంది అభ్యర్థులను కేటాయించగా.. 761 మంది హాజరయ్యారు. సజావుగా పరీక్షలు జరిగాయి. జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అధికారులు పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.

గ్రూప్–1 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలో ఆదివారం జరిగిన గ్రూప్–1 పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక తనిఖీ చేశారు. కేంద్రాల్లో సజావుగా పరీక్షలు జరిగేలా ఎటువంటి అవకతవకలు జరగకుండా భద్రతాపరమైన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు మహిళా డిగ్రీ కళాశాల, చైతన్య కళాశాల, ఎచ్చెర్లలోని అంబేడ్కర్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులకు సూచనలు చేశారు. ఎస్పీ వెంట శ్రీకాకుళం డీఎస్పీ యర్రగుంట శృతి, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

కాలభైరవస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో కాలభైరవస్వామి

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఆదివారం స్వర్ణాకర్షణ కాల భైరవ స్వామికి అభిషేకాలు జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేషపూజలు, హారతులు నిర్వహించి అలంకరణ చేశారు. గోపూజ, నిత్య అన్నదాన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

21న కోమర్తిలో అప్పలసూరి స్మారక సభ

శ్రీకాకుళం: విప్లవ సాయుధ రైతాంగ పోరాట యోధుడు మామిడి అప్పలసూరి 27వ వర్ధంతి సందర్భంగా.. ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు నరసన్నపేట మండలం కోమర్తి అమరవీరుల స్థూపం వద్ద నిర్వహిస్తున్న స్మారక సభను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడు, వానవానిపేట గ్రామాల్లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ పార్టీ ఆధ్వర్యంలో జరిగే స్మారక సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ కోరారు. ఆయనతో పాటు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఘనంగా బాలపార్వతమ్మ ఉత్సవాలు

ఎచ్చెర్ల: మండలంలోని దుంపపేటలో బాలపార్వతమ్మ పేరంటాలు ఉత్సవాలను గత మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ అమ్మవారికి ఏటా జాతర ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, ప్రతీ ఏటాలాగానే ఈ ఏడాది అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆదివారం పూజలు నిర్వహించారు. జాతరలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా



ఎస్ఈబీ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ గంగాధరరావు

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ సూపరింటెండెంట్ డి.గంగాధరరావు ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎస్ఈబీ కార్యాలయాన్ని ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మద్యం అక్రమ రవాణా చేస్తూ కేసులు నమోదైన వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. నిత్యం గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి మద్యం, ఇతర ఎన్నికల ప్రలోబాలపై నిఘా పెంచాలని సూచించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మూడు బాటిళ్లకు మించి అమ్మకాలు చేస్తే.. ఆ మద్యం దుకాణం నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లా ముఖద్వారమైన పైడిభీమవరం, అర్జునవలస, మెంటాడ, నారువ, సముద్రతీరం వంటి పరిసర ప్రాంతాల్లో సోదాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. ఈ రెండు నెలలు ఎన్నికల సమయంలో నిరంతరం అప్రమత్తతో ఉండాలన్నారు. స్టేషన్ రికార్డులు పరిశీలించి ప్రతీ కేసుకు సంబంధించిన రికార్డు పక్కాగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రణస్థలం ఎస్ఈబీ ఎస్ఐ ఎం.రవిప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణం



మాట్లాడుతున్న నారాయణస్వామి

శ్రీకాకుళం: కాలంతో పాటు మనిషి జీవన ప్రమాణాల శైలి మారుతోందని వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ గవర్నర్ జామి నారాయణస్వామి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో సూర్య నడక సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం జరిజగింది. అధ్యక్షులుగా డాక్టర్ సురేష్ పండా, కార్యదర్శిగా ఎస్.ఎస్.సుధాకర్, కోశాధికారిగా డి.లక్ష్మణరావు, ఉపాధ్యక్షునిగా ఎ.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ వి.సింహాచలం, జాలీ వాకర్‌గా ఎ.వెంకటేశ్వర్లు, క్లబ్ కోఆర్డినేట్‌గా కె.వెంకటరమణమూర్తి, మరో ఏడుగురు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నెషనల్ సంస్థ డిప్యూటీ గవర్నర్ ఎస్.జోగినాయుడు, మాజీ గవర్నర్‌లు సత్యం, ఇందిరా ప్రసాద్, సత్యనారాయణ, గుప్తా, మురళీమోహన్, రవిశంకర్, దేవీ ప్రసాద్, రామ్‌బాయి, లక్ష్మి పాల్గొన్నారు.

నిత్య అన్నదానానికి రూ. లక్ష విరాళం



చెక్కును ఈవో చంద్రశేఖర్‌కు అందజేస్తున్న దాత అప్పలసూరి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విశాఖపట్నం వాస్తవ్యులు ఆకుల అప్పలసూరి, అన్నపూర్ణ దంపతులు రూ. లక్ష విరాళం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు ఆదివారం అందజేశారు. అంతకుముందు దాతలు కుటుంబసభ్యులతో కలిసి ఆదిత్యున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు నేతేటి హరిప్రసాద్ శర్మ, సిబ్బంది బి.ఎస్.చక్రవర్తి ఉన్నారు.

కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా..

టెక్కలి: రోగంతో ఆస్పత్రికి వెళితే.. అక్కడ వైద్యంతో పాటు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే త్వరగా రోగి కోలుకుంటారు. టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ఇదే టెక్నిక్ ఫాలో అయ్యారు. ఆస్పత్రిలో చిన్న పిల్లల విభాగంలో పిల్లల్ని ఆకట్టుకునే విధంగా గోడలపై వివిధ రకాల బొమ్మలు వేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో తరచూ కనిపించే ఇటువంటి దృశ్యాలు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. చిన్న పిల్లల వైద్యుడి వద్దకు వచ్చే చిన్నారులు ఎటువంటి భయాందోళన చెందకుండా వివిధ రకాల బొమ్మలను వేసి వారిని ఆకట్టుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సరికొత్త మార్పులతో వైద్య విధానం కొత్తగా రూపు రేఖలు మార్చుకుంటోంది.

బాలుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు: తలసీమియా వ్యాధితో బాధపడుతున్న బాలుడికి పాతటెక్కలికి దిన పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ఇచ్ఛాపురం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దున్న లోహిత్ తలసీమియా వ్యాధితో బాధపడుతున్నారు. దాదాపు రూ. పది లక్షలు ఖర్చు చేస్తే గాని ప్రాణాలు నిలవవు. విషయం తెలుసుకున్న పాతటెక్కలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993–94 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 30 వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాలుడు తల్లి దున్న పార్వతికి పాతటెక్కలికి చెందిన నాయకురాలు తోట పార్వతమ్మ ద్వారా ఆదివారం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గాలి యామారావు, ఎస్.నీలయ్య, సత్యవతి, వనిత, జగదాంబ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలి



మాట్లాడుతున్న రమణమూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: మారుతున్న జీవనప్రమాణాల నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని రైజింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు, వాకర్స్ మాజీ గవర్నర్ కేవీ రమణమూర్తి అన్నారు. నగర సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో వాకర్స్ ఆరోగ్యంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. న్యూరో సర్జన్ డాక్టర్ పైల రమణ పక్షవాతం గురించి అవగాహన కల్పించారు. పక్షవాతం వచ్చేముందు శరీరంలో చోటుచేసుకునే కదలికలు, మార్పులు గురించి వివరించారు. వైద్యులు డాక్టర్ గిరి మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో రోజుకు రెండు నుంచి నాలుగు లీటర్ల వరకు మంచినీరు తాగాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం, నడకతో దీర్ఘకాలిక రోగాలబారిన పడకుండా మనల్నిమనం రక్షించుకోవచ్చన్నారు. అనంతరం రైజింగ్ స్టార్స్ వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులతో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–102 గవర్నర్ జామి నారాయణస్వామి ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. రైజింగ్ స్టార్‌వాకర్స్ గౌరవాధ్యక్షులు ఎం.వాసుదేవరావు, రీజియన్ కౌన్సిలర్–3 పీజీ గుప్త, కె.మురళీధర్, అధ్యక్షులు ఎంఎస్ఆర్ మూర్తి, ఉపాధ్యక్షులు జి.మురళి, కార్యదర్శి ఆర్.జగన్మోహనరావు, సంయుక్త కార్యదర్శి టి.గోవిందరావు, కోశాధికారి పార్వతీశం, టి.నారాయణరావు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, జెండాల తొలగింపు

- ఎన్నికల కోడ్ పక్కాగా అమలు



జి.సిగడాం: పెంట గ్రామంలో ఫ్లెక్సీలను తొలిగిస్తున్న సచివాలయం సిబ్బంది



రణస్థలం: జే.ఆర్.పురంలోని ఫ్లెక్సీలు తొలగిస్తున్న అధికారులు

జి.సిగడాం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎన్నికల నియామవళిపై ప్రత్యేక నిఘా వేశారు. మండల ఎన్నికల రిట్నరింగ్ అధికారి ఆర్.ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు పార్టీల జెండాలు, ఫ్లెక్సీలను ఆదివారం తొలిగించారు. సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రణస్థలం మండలంలో..

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల–2024 కోడ్ అమల్లోకి రావడంతో రణస్థలం మండలంలోని అధికారులంతా ప్రచార పోస్టర్లు, హోర్డింగ్‌లు తొలగిస్తున్నారు. జే.ఆర్.పురం, కోష్ట, పైడిభీమవరం వంటి ప్రాంతాల్లో ఆదివారం పంచాయతీ, రెవెన్యూ అధికారులు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, జెండాలు తీసి వేశారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. జే.ఆర్.పురం, కోష్ట పంచాయతీ కార్యదర్శులు ఆదినారాయణ, శ్రీధర్, జే.ఆర్.పురం వీఆర్వో లుకలాపు అప్పలనాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రణస్థలం: కోష్టలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న దృశ్యం

భక్తితో ఎల్లమ్మతల్లి జంగిడ పండుగ



ఎల్లమ్మతల్లి ఊరేగింపులో భక్తులు



పత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గాజుల వీధిలో ఆదివారం ఎల్లమ్మతల్లి జంగిడ పండుగ భక్తితో నిర్వహించారు. ఈ పండగను రాము, గోవిందు ఆధ్వర్యంలో జంగిడకు పూజలు చేసి అలంకరణ చేసి పురవీధులలో మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించిన పిదప అమ్మవారికి ఉపారం చెల్లించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నరు.

- నగరంలోని గుడివీధిలో ఎల్లమ్మతల్లి అమ్మవారి సిర్లు పండగ ఘనంగా ఆదివారంతో ముగిసింది. అమ్మవారికి గత ఐదురోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు సమర్పించారు. వీధిలోని పలు చోట్ల ఊరేగింపుగా సిర్లు జంగిడి తలపై ఉంచుకొని భక్తులు వేసే జోగి దండుకొని అమ్మవారి వద్దకు చేరుకుని, అక్కడ అగ్నిగుండం ఏర్పాటుచేసి నిప్పులు తొక్కడం జరిగింది.



జోగి దండుతున్న దృశ్యం

కాంప్లెక్స్ కిటకిట



నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద క్యూలో బారులు తీరిన ప్రయాణీకులు



పల్లెవెలుగు బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు, భక్తులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. గ్రూప్–1 పరీక్ష జరగడంతో అభ్యర్థుల రాకపోకలు, అలాగే వత్సవలస జాతరకు వెళ్లే భక్తులతో కళకళలాడింది. ముఖ్యంగా గ్రూప్–1 పరీక్ష కోసం ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు బస్సు ఎక్కే సమయంలో తోపులాటలు జరగకుండా ఉండేందుకు ఆర్టీసీ పోలీసులు పరిస్థితిని పరిశీలించారు.